క్లుప్తంగా

15 రోజుల్లో అర్జీల పరిష్కారం



ఉపమాక సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్

నక్కపల్లి: రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలన్నింటిని 15 రోజుల్లో పరిష్కరిస్తామని తహసీల్దార్ ఆర్.నర్సింహమూర్తి తెలిపారు. సోమవారం ఉపమాకలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. తమ పరిధిలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరిస్తున్నట్టు చెప్పారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాల్సినవి వెంటనే పంపిస్తున్నామన్నారు. వచ్చిన ప్రతి అర్జీకి జవాబుదారీతనం ఉండాలనే ఉద్దేశ్యంతోనే ఆన్‌లైన్ చేసి రశీదు ఇస్తున్నామన్నారు. 22ఏ, పట్టాదారు పాసుపుస్తకాలు, ఆన్‌లైన్ సమస్యలు, వెబ్‌ల్యాండ్ సమస్యలపై ప్రజలు దరఖాస్తులు అందజేశారు. వివిధ సమస్యలపై రైతుల నుంచి 25కి పైగా అర్జీలు అందాయి. ఈ సదస్సులో డీటీ అన్నాజీ రావు, ఆర్ఐ కన్నబాబు, ఉపమాక దేవస్థానం మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి, సర్పంచ్ వీరబాబు, పలువురు రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో రైతులకు మేలు



ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను విక్రయిస్తున్న మహిళలు

మునగపాక: ప్రకృతి వ్యవసాయం రైతులకు మేలు చేకూరుస్తుందని మండల పరిషత్ సూపరింటెండెంట్ ప్రసాద్‌కుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో వ్యవసాయ శాఖ, రైతు సాధికార సంస్థ సౌజన్యంతో చూచుకొండ యూనిట్ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవనం కావాలంటే ప్రతి ఒక్కరూ ఆర్గానిక్ ఉత్పత్తులను వినియోగించాలన్నారు. ఇక్కడ తాజా కూరగాయలతో పాటు పలు రకాల ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జి వి.సతీష్, ఐసీఆర్‌పీ సీహెచ్.పార్వతి, నూకరత్నం, గౌరీ, జయలక్ష్మి, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఇంధన పొదుపుపై చిత్రలేఖన పోటీలు



తాము వేసిన చిత్రాలతో విద్యార్థులు

మునగపాక: నాగులాపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. విద్యుత్ శాఖ ఏఈ రామకృష్ణ, ఏడీఈ సురేష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంధనాన్ని పొదుపుగా వినియోగించాలన్నారు. తద్వారా వెలుగులు నింపవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ గోపీకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా భారీ గొయ్యి



భోగాపురం వద్ద ఏర్పడిన భారీ గొయ్యిని చూపిస్తున్న సీపీఎం నాయకులు

అచ్యుతాపురం: మండలంలోని సెజ్‌కు వెళ్లే భారీ వాహనాల రాకపోకల కారణంగా రోడ్లు అధ్వానంగా తయారయ్యాయని సీపీఎం నాయకులు ఆరోపించారు. భోగాపురం వెళ్లే రహదారిలో ఆంజనేయ స్వామి గుడి వద్ద భారీ గొయ్యి ఏర్పడిందని, తక్షణమే పూడ్చాలని కోరారు. ఈ మేరకు సీపీఎం నాయకులు సోమవారం ఆ గొయ్యి వద్ద నిరసన తెలిపారు. సీపీఎం మండల కన్వీనర్ ఆర్.రాము, సోమునాయుడు, పైల కొండబాబు, పైల బాబూరావు, అప్పలనాయుడు, సత్తిబాబు పాల్గొన్నారు. ఈ గొయ్యి వల్ల తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.



అధ్వానంగా దర్శనమిస్తున్న అరబుపాలెంలో సాగునీటి కాలువ



మునగపాక బీసీ కాలనీని ఆనుకొని సాగునీటి కాలువ దుస్థితి

సాగునీటి సమస్యలు తీరేదెలా?

- అధ్వానంగా కాలువలు
- పేరుకుపోయిన తూటికాడ, మురుగునీరు
- పలుచోట్ల ఆక్రమణలతో కుచించుకుపోయిన కాలువలు

మునగపాక: సాగునీటి కోసం అన్నదాతలకు ఏటా కష్టాలు తప్పడం లేదు. కాలువలు తుప్పలతో పూడుకుపోవడంతో పొలాలకు సాగునీరు అందని పరిస్థితులు నెలకొన్నాయి. పాలకులు, అధికారుల నిర్లక్ష్యం వల్ల వేలాది ఎకరాలకు నిరంతరాయంగా సాగునీరందించే కాలువలు అధ్వానంగా తయారయ్యారన్న ఆరోపణలు ఉన్నాయి. మునగపాక మండలంలోని సాగునీటి కాలువలు అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. సాగునీటి కాలువ సంఘాల ఎన్నికలపై ఉన్న శ్రద్ధ కాలువలను మెరుగుపరచడంలో దృష్టి సారించడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

అధ్వానంగా కాలువలు, చెరువులు

మండల వ్యాప్తంగా సాగునీటి కాలువలు అధ్వానంగా తయారయ్యాయి. మునగపాక, తోటాడ, నాగులాపల్లి, ఉమ్మలాడ, అరబుపాలెం తదితర చోట్ల కాలువల స్వరూపం మారిపోయింది. కాలువల చుట్టూ పిచ్చి తుప్పలు, తూటికాడలతో దర్శనమిస్తున్నాయి. కొన్ని చోట్ల కాలువల్లో మురుగునీరు ప్రవహిస్తోంది. మెజార్టీ రైతులు సాగునీటి కాలువల ఆధారంగా చెరకు, వరితో పాటు అపరాల సాగు చేపడుతుంటారు. అయితే సాగునీటి వనరులు అధ్వానంగా ఉండడంతో పంటల సాగు ప్రశ్నార్థకంగా మారిందని రైతులు వాపోతున్నారు. ఏడాదికొకసారి సాగునీటి కాలువల అభివృద్ధిపై అధికారులు దృష్టి సారించాల్సి ఉన్నా నిధుల లేమి కారణంగా వాటి వైపు చూడడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. దీనికి తోడు కాలువలు, చెరువులు ఆక్రమణలకు గురవుతున్నా పాలకులు, అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారంటూ రైతులు మండిపడుతున్నారు.



మునగపాక మెయిన్‌రోడ్డులో కృష్ణంరాజు కాలువ

11 సాగునీటి కాలువలు.. 7,174 ఎకరాల్లో సాగు

మండల వ్యాప్తంగా 11 సాగునీటి కాలువలు ఉన్నాయి. 7,174 ఎకరాల్లో పలు రకాల పంటల సాగు జరుగుతోంది. చూచుకొండ పరిధిలో చర్చర్ల గెడ్డ వాడ్రాపల్లిలో చిన ఆవ కాలువ, తిమ్మరాజుపేటలో కృష్ణంరాజు కాలువ, గణపర్తిలో రెలుగెడ్డ, నాగులాపల్లి ఛానల్, తోటాడలోని ఆవ కాలువ, మెలిపాకలోని గర్లాడ కాలువ, మెలిపాకలోని చల్లమల గెడ్డ, మెలిపాకలోని కొమరాజు కాలువ, మడకపాలెంలో రాజు చెరువు, వెంకటాపురంలో ఊర కాలువలు ఉన్నాయి. ఆయా సంఘాల పరిధిలో రైతులు కేవలం కాలువల ఆధారంగా పంటల సాగు చేపడుతున్నారు.

కాలువల అభివృద్ధికి అంచనా వేశాం..

సాగునీటి వనరుల అభివృద్ధికి సంబంధించి ఇప్పటికే అంచనా వేశాం. సాగునీటి ప్రవాహానికి ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వం నుంచి ఇంత వరకు ప్రతిపాదనలు పంపాలని ఆదేశించలేదు. జనవరి నెలాఖరులోగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

– వినయ్, నీటి పారుదల శాఖ ఏఈ

పదవుల కోసం యావ!

కూటమి ప్రభుత్వం సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి కోట్లాది రూపాయలు ఖర్చు చేసింది. సాగునీటి వనరుల అభివృద్ధిపై దృష్టి సారించాల్సిన పాలకులు కేవలం ప్రచారం కోసం అట్టహాసం చేస్తున్నారని రైతులు విమర్శిస్తున్నారు. కేవలం తమ అనుయాయులకు ఎన్నికల పేరిట పదవులను కట్టబెట్టేందుకు కూటమి ప్రభుత్వం సాగునీటి సంఘాల ఎన్నికలను తెరమీదకు తీసుకువచ్చిందంటూ ప్రస్తుతం చర్చ సాగుతోంది.

దిగువ ప్రాంతాలకు నీరు అందడం లేదు..



సాగునీటి కాలువలు అధ్వాసంగా ఉన్నాయి. ఎగువ నుంచి వచ్చే నీరు దిగువ ప్రాంతాలకు వెళ్లేందుకు అవకాశం లేదు. దీంతో సాగునీటికి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఎప్పటికప్పుడు కాలువలను అభివృద్ధి చేయాల్సి ఉన్నా అటువంటి పరిస్థితులు కనిపించడం లేదు. పాలకులు, అధికారులు సాగునీటి వనరులపై దృష్టి సారించాలి.

– బొడ్డేడ చెల్లయ్యనాయుడు, రైతు, మూలపేట

ఎన్నికలపై ఉన్న ప్రేమ రైతులపై లేదు



సాగునీటి సంఘాల ఎన్నికలపై ఉన్న ప్రేమ రైతులపై లేదు. సీజన్‌కు ముందుగానే సాగునీరు ప్రవహించేలా చర్యలు తీసుకోవాలి. సాగునీటి కాలువల్లో మురుగునీరు ప్రవహిస్తుంది. తూటికాడ పెరిగిపోవడంతో ఎగువ నుంచి కిందకు నీరు ప్రవహించే పరిస్థితులు లేవు. పంటల సాగుకు ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– టెక్కలి జగ్గారావు, రైతు,మునగపాక

ఆరోగ్యవంతమైన గ్రామాలే లక్ష్యం



మాట్లాడుతున్న ఎంపీడీవో ఉషారాణి

మునగపాక: ఆరోగ్యవంతమైన గ్రామాలే లక్ష్యం కావాలని ఎంపీడీవో ఎం.ఉషారాణి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇతర అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయం చేసుకుంటూ గ్రామాల్లో సమస్యలపై దృష్టి సారించాలన్నారు. బాల్య వివాహాలను అరికట్టడంతో పాటు పోక్సో చట్టంపై అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఒక్కరూ విద్యావంతులైన నాడే గాంధీజీ కన్న కలలు నెరవేరుతాయన్నారు. విద్యకు ప్రాధాన్యత కల్పించాలన్నారు. మద్యపానం, గంజాయి వంటి వ్యసనాలకు దూరంగా ఉండేలా చూడాలని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి కోరారు. ఆరోగ్యవంతమైన గ్రామం తయారీలో అధికారుల పాత్ర కీలకమన్నారు. వైద్యాధికారులు ఎస్తేర్‌రాణి, విమలగిరి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మానస, వ్యవసాయాధికారి జ్యోత్స్నకుమారి, మండల ఇంజినీరింగ్ అధికారి గులామ్, ఈవోఆర్డీ సోమరాజు, సూపరింటెండెంట్ ప్రసాద్, తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని పారిశుధ్య కార్మికుల వినతి



మునగపాక ఎంఈవో–2 శివనాయుడుకు వినతి అందజేస్తున్న పారిశుధ్య కార్మికులు

మునగపాక: పెండింగ్‌లో ఉన్న వేతనాలు మంజూరు చేయాలని కోరుతూ సోమవారం ఎంఈవో–2 బుద్ద శివనాయుడుకు ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రతినిధులు ఆర్.వెంకటలక్ష్మి, కె.ఎ.లక్ష్మి మాట్లాడుతూ తాము ఏళ్ల తరబడి పాఠశాలల్లో పారిశుధ్య కార్మికులుగా పని చేస్తున్నామని, 6 నెలలుగా వేతనాలు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. శానిటేషన్ నిర్వహణకు అవసరమయ్యే పరికరాలు అందించాలన్నారు. కొన్ని చోట్ల రాజకీయ కక్షల కారణంగా తొలగింపులు జరుగుతున్నాయని, వీటిని నివారించాలని కోరారు. ఈఎస్ఐ సదుపాయం , సంవత్సరానికి రెండు జతల యూనిఫారం అందించాలన్నారు. దీనిపై స్పందించిన ఎంఈవో శివనాయుడు కార్మికుల సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

ఎంఈవో కార్యాలయం ఎదుట ఆయాల ఆందోళన



ఎంఈవో కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న పాఠశాలల ఆయాలు

ఎస్.రాయవరం: పాఠశాలల్లో పని చేసే ఆయాలకు నాలుగు నెలల వేతన బకాయిలను వెంటనే విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక జిల్లా కార్యదర్శి ఎం.సత్యనారాయణ డిమాండ్ చేశారు. మండలంలో పలు పాఠశాలల్లో పని చేసే ఆయాలు మండల విద్యాశాఖ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన తెలిపారు. తమకు వస్తున్న అరకొర వేతనాలు నెలలు తరబడి పెండింగ్ పెడితే తాము ఎలా బతుకుతామని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం విద్యాశాఖ కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. పారిశుధ్య పనులు చేసేటప్పుడు గ్లౌజులు, మాస్కులు, చీపుర్లు, ఫినాయిల్, తదితర సామగ్రిని సరఫరా చేయాలని సత్యనారాయణ కోరారు.


మొక్కుబడిగా సామాజిక తనిఖీ ప్రజావేదిక



ప్రజావేదికలో మాట్లాడుతున్న డ్వామా పీడీ పూర్ణిమాదేవి

యలమంచిలి రూరల్: మండలంలోని మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా 2023–24 సంవత్సరంలో చేపట్టిన పనులు, చెల్లింపులకు సంబంధించి సోమవారం నిర్వహించిన 17వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక మొక్కుబడిగా జరిగింది. ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో చేపట్టిన ప్రజావేదికను అధికారులు, ప్రజాప్రతినిధులు తూతూ మంత్రంగా నిర్వహించి మమ అనిపించారు. మండలంలో మొత్తం 17 పంచాయతీలకు సంబంధించి 677 పనులకు రూ.8.41,36,150, పంచాయతీరాజ్ ద్వారా 31 పనులకు రూ.1,12,98,413, ఇతర పనులకు సంబంధించి రూ.3,55,427 మొత్తంగా 709 పనులకు వెచ్చించిన రూ.7,97,28,426(వేతనాల కోసం), మెటీరియల్ నిమిత్తం ఖర్చు చేసిన రూ.1,60,61,564 కలిపి మొత్తం రూ.9,57,89,990లకు గ్రామాల్లో సామాజిక తనిఖీ ద్వారా రూపొందించిన నివేదికలను ప్రజావేదికలో చదివి వినిపించారు. కూటమి పార్టీలకు చెందిన నాయకులు మాత్రమే హాజరై తమ గ్రామాల్లో పనిచేస్తున్న మేట్లు, క్షేత్ర సహాయకులపై చర్యలు తీసుకోవడమే లక్ష్యంగా ప్రజావేదిక నిర్వహించారే తప్ప, అర్థవంతమైన చర్చ జరగలేదు. ప్రజావేదిక జరిగిన ప్రాంగణంలో వేసిన కుర్చీలన్నీ ఖాళీగా కనిపించాయి. ఉదయం 11.30 గంటలకు రాష్ట్ర రహదారుల అభివృద్ధి సంస్థ చైర్మన్ ప్రగడ నాగేశ్వరావు, సాయంత్రం 4 గంటలకు ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్‌లు వచ్చి ప్రసంగించి వెళ్లిపోయారు. గతంలో జరిగిన అక్రమాలకు బాధ్యులపై చర్యలుంటాయని ఎమ్మెల్యే అన్నారు. డ్వామా పీడీ పూర్ణిమాదేవి, విజిలెన్సు అధికారి నిర్మలాదేవి, ఎంపీపీ బోదెపు గోవింద్, వైస్ ఎంపీపీ రాజానశేషు, ఎంపీడీవో కొండలరావు, నరేగా సిబ్బంది పాల్గొన్నారు.

రామానుజన్ గణిత పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ



రామానుజన్ గణిత పరీక్షలో విజయం సాధించిన శ్రీప్రకాష్ విద్యార్థులు

పాయకరావుపేట: రామానుజన్ గణిత పరీక్షల్లో శ్రీప్రకాష్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. రామచంద్రపురానికి చెందిన రామానుజన్ ఎడ్యుకేషనల్ సొసైటీ రెండు స్థాయిలో నిర్వహించిన పరీక్షల్లో శ్రీప్రకాష్‌లో 3వ తరగతి చదువుతున్న తుమ్మలపల్లి హారిక, 4వ తరగతి చదువుతున్న లెక్కల సత్యరోచన్ మొదటి ర్యాంకు సాధించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను విద్యా సంస్థల అధినేత సిహెచ్.వి.కె.నర్సింహారావు, సంయుక్త కార్యదర్శి సిహెచ్.విజయ్‌ప్రకాష్, ఉపాధ్యాయులు అభినందించారు.

పోషకాహారం శ్రేయస్కరం

మునగపాక: పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని గణపర్తి సర్పంచ్ చదరం గణేష్‌నాయుడు సూచించారు. మండలంలోని గణపర్తిలో సోమవారం ఏషియన్ పెయింట్స్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వంటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాజా ఆహారం తీసుకోవాలన్నారు.

న్యాయంపూడి సర్పంచ్‌కు అభినందన



వరహాలబాబును సన్మానిస్తున్న వీసం, తదితరులు

నక్కపల్లి: వైఎస్సార్‌సీపీకి చెందిన రెడ్డి వరహాలబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న న్యాయంపూడి పంచాయతీకి కేంద్ర ప్రభుత్వ అవార్డు రావడం ఎంతో గర్వంగా ఉందని రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ అన్నారు. ప్రతిష్ఠాత్మకమైన కేంద్ర ప్రభుత్వ దీనదయాళ్ ఉపాధ్యాయ పంచాయతీ శతత్ వికాస్ పురస్కారం అందుకున్న సర్పంచ్ రెడ్డి వరహాలబాబును గ్రామంలో ఘనంగా సన్మానించారు. గత ప్రభుత్వం మంజూరు చేసిన జల జీవన్ మిషన్ నిధులతో ఇంటింటికి కుళాయిలు ఏర్పాటు చేసి తాగునీటి సమస్యను పూర్తిగా పరిష్కరించారని వీసం కొనియాడారు. సర్పంచ్‌ను సన్మానించిన వారిలో ఆ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు పొడగట్ల పాపారావు, సహచర సర్పంచ్‌లు పొడగట్ల వెంకటేష్, వెదుళ్ల రమణ, పి.సూరిబాబు, తదితరులు ఉన్నారు.

హాస్టళ్లలో వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలి

యలమంచిలి రూరల్: ప్రభుత్వ హాస్టళ్లలో మినీ వాటర్‌ప్లాంట్లు ఏర్పాటు చేయాలని, ఈ సీజన్‌లో విద్యార్థులకు దోమ తెరలను అందజేయాలని ఎస్‌ఎఫ్ఐ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం ఎస్‌ఎఫ్ఐ జిల్లా సెక్రటరీ మామిడి రమణ నేతృత్వంలో విద్యార్థుల బృందం యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. యలమంచిలి ప్రాంతంలో 4 వసతి గృహాలున్నాయని, సుమారు 400 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని వారు చెప్పారు. రాత్రి వేళల్లో దోమలు స్వైర విహారం చేయడం వల్ల విద్యార్థులు రోగాల బారిన పడుతున్నారన్నారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి

యలమంచిలి రూరల్: ఉపాధి హామీ పథకం కూలీలకు సకాలంలో బిల్లులు చెల్లించి, మంచినీరు, పరికరాలు అందించడంతో పాటు సమ్మర్ అలవెన్సులు ఇవ్వాలని సీఐటీయూ యలమంచిలి మండలం కార్యదర్శి సీహెచ్ శివాజీ డిమాండ్ చేశారు. ఉపాధి కార్మికుల సమస్యలపై సోమవారం డ్వామా పీడీ ఆర్.పూర్ణిమాదేవికి వినతిపత్రం అందజేశారు. ఉపాధి కూలీలకు 200 రోజులు పనిదినాలు కల్పించి, రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలని కోరారు. చాలా చోట్ల ఉపాధి కూలీలకు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో అప్పులు చేసి కుటుంబాలను పోషించుకోవలసి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

వీధి దీపాల ఏర్పాటు



వీధి లైట్ అమరుస్తున్న సిబ్బంది

కోటవురట్ల: కె.వెంకటాపురంలో సోమవారం వీధి లైట్ల మరమ్మతులు చేపట్టారు. పలు వీధుల్లో లైట్లు పాడైపోవడంతో స్థానికులు ఫిర్యాదు చేశారు. చీకట్లో పిల్లలు, వృద్ధులతో ఇబ్బంది పడుతున్నామని మొర పెట్టుకోవడంతో సర్పంచ్ పైల శ్రీదేవి మంగా ఇందిర భవానీ చర్యలు చేపట్టారు. కాలిపోయిన బల్బులను మార్చి కొత్త వాటిని అమర్చారు. దాంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

మునగపాక పాత హాస్టల్ పరిశుభ్రం

సాక్షి ఎఫెక్ట్..



వసతి గృహంలో మద్యం సీసాలు ఏరివేయిస్తున్న ఎస్ఐ ప్రసాదరావు

మునగపాక: మునగపాక బీసీ కాలనీలోని పూర్వపు సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. రాత్రి వేళల్లో మద్యం సేవించడం, గంజాయి తాగడం వంటి కార్యక్రమాలకు యువత పాల్పడుతున్నారు. దీంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ మేరకు సాక్షి దినపత్రికలో సోమవారం 'అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా పాత హాస్టల్'పేరిట ప్రచురితమైన కథనానికి ఎస్ఐ పి.ప్రసాదరావు స్పందించారు. స్థానిక సర్పంచ్ దిమ్మల అప్పారావు, పారిశుధ్య కార్మికుల సహకారంతో హాస్టల్ భవనంపై పేరుకుపోయిన వందలాది మద్యం సీసాలను తొలగించారు. హాస్టల్ చుట్టూ సీసీ కెమెరాలు, నలువైపులా విద్యుత్ కాంతులు వెదజల్లేలా చర్యలు చేపట్టారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

సీపీఎం మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

మునగపాక: ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి జరగనున్న మహాసభలను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు వీవీ శ్రీనివాసరావు కోరారు. మునగపాకలో సోమవారం ఈ మేరకు పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సీపట్నంలో మూడు రోజుల పాటు మహాసభలు జరుగుతాయన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై రాజీలేని పోరాటం చేస్తామన్నారు. ఎన్నికల ముందు రెండు ప్రభుత్వాలు ఇచ్చిన మాటలను విస్మరించాయన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎస్.బ్రహ్మాజీ, పెంటకోట సత్యనారాయణ, సంజీవరావు, రాము, నరసింగరావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ధనుర్మాస పూజలు ప్రారంభం



వాడ్రాపల్లిలో ధనుర్మాస పూజలు చేస్తున్న భక్తులు



కె.వెంకటాపురంలో మేలుకొలుపు చేస్తున్న భక్తులు

మునగపాక: మండల వ్యాప్తంగా సోమవారం రామాలయాల్లో ధనుర్మాస పూజలు ఘనంగా ప్రారంభమయ్యాయి. నెలగంట పెట్టిన తరువాత మహిళలు ఉదయం నుంచి రామాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మునగపాక, వాడ్రాపల్లి, నాగులాపల్లి, గవర్ల అనకాపల్లి, అరబుపాలెం తదితర గ్రామాల్లో పండితులు అర్చనలు, పూజలు చేశారు.

కోటవురట్ల: ధనుర్మాసోత్సవాలు ప్రారంభం సందర్భంగా కైలాసపట్నంలో రాజగోపాలస్వామి ఆలయంలో భక్తుల తాకిడి నెలకొంది. స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులు ధ్వజస్తంభం వద్ద దీపారాధన చేశారు. కె.వెంకటాపురంలో ధనుర్మాసోత్సవాలలో భాగంగా మేలుకొలుపు నిర్వహించారు. దేవుడి చిత్రపటాలు చేతపట్టి వీధుల్లో నగర సంకీర్తన చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు గొల్లు చిట్టిబాబు, పైల శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

ఎస్.రాయవరం: ఎస్.రాయవరం వైభవ వేంకటేశ్వర స్వామి, దార్లపూడి కల్యాణ వేంకటేశ్వరస్వామి, వమ్మవరం స్వయంభూ వేంకటేశ్వరస్వామి, కొరుప్రోలు సీతారామస్వామి ఆలయాల్లో పూజలు చేశారు. నెల రోజుల పాటు తిరుప్పావై పాశురాలు చదివి వినిపిస్తామని అర్చకులు తెలిపారు.

పెన్షనర్ల సమావేశం నేడు

యలమంచిలి రూరల్: యలమంచిలి తాలూక రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం సభ్యుల సమావేశం మంగళవారం పట్టణంలోని అటవీ శాఖ కార్యాలయం పక్కనున్న ఎన్‌జీవో హోమ్‌లో నిర్వహించనున్నట్టు సంఘం అధ్యక్షుడు సీహెచ్. సోమేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్టు పేర్కొన్నారు. యలమంచిలి పరిధిలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లంతా ఈ సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు.

21న మండల సర్వసభ్య సమావేశం

రాంబిల్లి(యలమంచిలి): ఈ నెల 21న రాంబిల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ గొట్టిముక్కల శిరీష అధ్యక్షతన స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరగనుంది. ఈ సర్వసభ్య సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు విధిగా హాజరు కావాలని ఎంపీడీవో జయ మాధురి సోమవారం ఒక ప్రకటనలో కోరారు.

భక్తిశ్రద్ధలతో మహా లింగార్చన

మునగపాక: మునగపాక మెయిన్‌రోడ్డులోని లింగరాయి గుడిలో సోమవారం రాత్రి మహా లింగార్చన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ధనుర్మాసం ప్రారంభంలో భాగంగా వేద పండితులు సోమశేఖర శర్మ నేతృత్వంలో ప్రత్యేక పూజలు చేశారు. శివ నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. లింగార్చన కార్యక్రమాన్ని తిలకించేందుకు భక్తులు తరలివచ్చారు.

వేలం ప్రకటన

మహారాజశ్రీ యలమంచిలి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E.P.No. 7/2020 O.S. No. 171/2012
Between:
పడమట సుబ్బలక్ష్మి .. DHR
And
ప్రగడ అన్నపూర్ణ .. JDR

పై నెంబరు అమలులో DHR వారికి చెల్లించవలసిన డిక్రీ బాకీ వగైరాలు రాబట్టు నిమిత్తం ఈ JDR యొక్క దిగువ షెడ్యూలు స్థిరాస్తి వేలం నిమిత్తం తే. 02-01-2025న వాయిదా అయి వున్నది. సదరు వాయిదా రోజు ఉదయం సదరు పై కోర్టులో 10:30 గం॥ నుండి సాయంత్రం 5-00 గం॥ల వరకు వేలం కాబడును. సదరు వేలంలో పాల్గొనదలచిన వారు పాల్గొని వేలం పాట పాడుకొనవచ్చునని ఇందుమూలంగా యావన్మంది ప్రజలకు తెలియజేయడమైనది.

షెడ్యూలు

విశాఖపట్నం జిల్లా, యలమంచిలి సబ్ రి॥ యలమంచిలి మండలం, యలమంచిలి టౌన్, 8th Ward, 14th Block, C.P. పేట ఏరియా, పడమట దిక్కున పంచాయితీ రోడ్డులో ఖాళీ స్థలం మరియు RCC స్లాబు ఇల్లు డోర్. నెం. 14-71 గల ఇంటికి హద్దులు.
తూ॥ప॥ 36 అడుగులు (10.97 చ॥మీ॥)
ఉ॥ద॥ 47 అడుగులు (14.325 చ॥మీ॥)
మొత్తం 188 చ॥గ॥లు (152.92 చ॥మీ॥)
హద్దులు: తూర్పు: మైనం శంకరరావు స్థలం, దక్షిణం: కొరారు నానాజీ స్థలం, పడమర: నంతగోడ, ఉత్తరం: నిమ్మకాయల తమ్మిరాజు స్థలం.
డి.హెచ్.ఆర్.విలువ రూ॥ 10,00,000
అమీన్ విలువ: రూ॥ 15,00,000
మార్కెట్ విలువ: రూ॥ 26,10,000 వేలం తేది: 02-01-2025

యలమంచిలి
తేది.16-12-2024
N.R.S.T. ROY, అడ్వకేట్, యలమంచిలి, సెల్: 94407 87877
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం ఈ ప్రకటన ఇవ్వడం అయినది)